

AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
11-11-2025 (Tuesday) MAIN EDITION

## యూజర్లకు షాక్ ఇచ్చిన ఎయిర్‌టెల్




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్ :** తన యూజర్లకు ఎయిర్‌టెల్ షాక్ ఇచ్చింది. ప్రస్తుతం ఉన్న అత్యంత చౌకైన ప్లాన్‌ను ఎత్తేసింది. ఇటీవల ప్రవేశ పెట్టిన ఈ ప్లాన్‌ను తొలగించింది. జియో తర్వాత ఎయిర్‌టెల్‌కు అత్యధిక వినియోగదారులు ఉన్నారు. రూ.189 రీఛార్జ్‌తో కొద్ది నెలల క్రితమే అందుబాటులోకి తెచ్చిన అన్‌లిమిటెడ్ ప్లాన్‌ను సంస్థ తాజాగా తొలగించింది. దీంతో ఇక నుంచి రూ.199తో కనీస రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది.

## పుతిన్ భారత పర్యటనకు ఏర్పాట్లు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ ఈ డిసెంబర్‌లో భారత్‌లో పర్యటించనున్నారు. ఆయన పర్యటనకు సంబంధించి క్రెమ్లిన్ ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆ దేశ ప్రభుత్వ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. డిసెంబర్‌లో పుతిన్ భారత్‌లో పర్యటించాలని నిర్ణయించుకున్నట్లు క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన సన్నాహాలు వేగంగా పూర్తిచేస్తున్నట్లు వెల్లడించారు.

## ఇంటికో పారిశ్రామికవేత్త ఉండాలి



**అక్షరటుడే, అమరావతి:** ఇంటికో పారిశ్రామికవేత్త ఉండాలనేది తమ లక్ష్యమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. రెవెన్యూ సమస్యలు పరిష్కరించే బాధ్యత తనదని పేర్కొన్నారు. ఈ ఏడాది లక్ష మంది మహిళలను వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రకాశం జిల్లా కనిగిరిలో సీఎం పర్యటించారు. ఇందులో భాగంగా ఎంస్ఎంఈ పార్కును ప్రారంభించారు.

## ఫిలిప్పీన్స్‌లో తుపాను బీభత్సం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఫిలిప్పీన్స్‌ను వణికించిన 'ఫంగ్ వాంగ్' పెనుతుపాను ధాటికి వేర్వేరు ఘటనల్లో ఎనిమిది మంది మృతి చెందారు. వరదలు, కొండచరియలు విరిగిపడి.. వీరు ప్రాణాలు కోల్పోయారు. 14 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రధానంగా ఉత్తర భాగం బాగా దెబ్బతింది.

## టయోటా సరికొత్త హైలక్స్



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** టయోటా సరికొత్త హైలక్స్ కారును ఆవిష్కరించింది. డీజిల్, ఫ్యూయల్ సెల్ వేరియంట్లతో పాటు మొదటిసారిగా ఈ మోడల్‌లో బ్యాటరీ విద్యుత్ వాహనం (బీఈవీ) వెర్షన్ తీసుకొస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. దీనిని ఒకసారి ఛార్జి చేస్తే, 300 కి.మీ.కు పైగా ప్రయాణించొచ్చని సంస్థ చెబుతోంది.

## కంటైనర్ లారీ బీభత్సం.. ఆరుగురి మృతి

**అక్షరటుడే, నెల్లూరు :** కంటైనర్ లారీ బీభత్సం సృష్టించింది. రోడ్డు పక్కన చిరు వ్యాపారాలు చేసుకునే వారి మీదకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు. నెల్లూరు జిల్లాలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. నెల్లూరు ఎన్టీఆర్ నగర్ వద్ద చేపల లోడ్‌తో వెళ్తున్న కంటైనర్ లారీ బీభత్సం సృష్టించింది. అతివేగంగా వచ్చిన లారీ స్థానికులపైకి దూసుకెళ్లింది. ఒక టాటా ఎస్ వాహనం, మూడు బైక్‌లను సైతం ఢీకొంది. అనంతరం చెట్టును ఢీకొట్టి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురు ఆస్పత్రికి తరలించిన తర్వాత చనిపోయారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

## ట్రావెల్స్ బస్సు దగ్ధం

**అక్షరటుడే, కర్నూల్ :** కర్నూల్ జిల్లాలో ఇటీవల ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధమై 19 మంది సజీవ దహనం అయిన విషయం తెలిసిందే. ఆ ఘటన మరువక ముందే మరో ట్రావెల్స్ బస్సు కాలిపోయింది. ఈ ఘటన నల్గొండ జిల్లాలో చోటు చేసుకుంది. విహారి ట్రావెల్స్‌కు చెందిన బస్సు హైదరాబాద్ నుంచి నెల్లూరు వెళ్తుండగా.. ప్రమాదం చోటు చేసుకుంది. విజయవాడహైదరాబాద్ హైవేపై నల్గొండ జిల్లా చిట్యాల మండలం పిట్టంపల్లి వద్ద బస్సులో మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ వెంటనే బస్సును పక్కకు ఆపాడు. దీంతో ప్రయాణికులు అద్దాలు పగులకొట్టుకొని కిందకు దూకారు. అనంతరం బస్సు పూర్తిగా కాలిపోయింది. ఘటన సమయంలో బస్సులో మొత్తం 29 మంది ప్రయాణికులు ఉన్నారు.

**ఢిల్లీలోని చారిత్రక ఎర్రకోట సమీపంలో కారుబాంబు పేలుడు ఘటన వెనుక ఉగ్ర కోణం బయట పడింది. సోమవారం భద్రతాబలగాలు ఛేదించిన ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యుల్‌కు చెందిన భారీ ఉగ్ర కుట్ర నేపథ్యంలోనే తాజా పేలుడు చోటు చేసుకున్నట్లు తేలింది. అమ్మోనియం నైట్రేట్, డిటోనేటర్లు ఉపయోగించి పేలుడుకు పాల్పడినట్లు వెలుగులోకి వచ్చింది. పుల్వామా ప్రాంతానికి చెందిన డాక్టర్ ఉమర్ మహమ్మద్ ఆత్మాహుతి దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్ ను భద్రతాబలగాలు పసిగట్టిన నేపథ్యంలో తాను దొరికిపోతాననే భయంతోనే డాక్టర్ ఉమర్ మొహమ్మద్ ఈ దారుణానికి పాల్పడినట్లు తేలింది. ఎర్రకోట సమీపంలోని జంక్షన్ వద్ద పేలుడు చోటు చేసుకున్న కారును అతడే నడుపుతున్నట్లు గుర్తించారు. అతడికి సంబంధించిన ఫొటోను దర్యాప్తు సంస్థలు విడుదల చేశాయి. ఫరీదాబాద్‌లోని టెర్రర్ మాడ్యూల్‌తో అతనికి సంబంధాలు ఉన్నాయని, అక్కడ భారీ పేలుడు పదార్థాల నిల్వను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నాయి.**



# ఢిల్లీ పేలుడు.. ఉగ్రదాడే..

- పుల్వామా వయా ఫరీదాబాద్ టు ఢిల్లీ
- దర్యాప్తులో కీలకాంశాలు వెలుగులోకి..
- ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యుల్‌కు ఢిల్లీ ఘటనకు లింక్
- ఉగ్ర కుట్రను భగ్నం చేయడంతోనే ఢిల్లీ పేలుడు
- సూత్రధారి డాక్టర్ ఉమర్ మహమ్మద్‌గా గుర్తింపు
- దేశవ్యాప్తంగా భద్రత అప్రమత్తం
- హోం మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష

ఢిల్లీలో 12 మందిని బలిగొన్న ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడులో అమ్మోనియం నైట్రేట్, ఇంధన నూనె డిటోనేటర్లను వినియోగించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్‌కు సంబంధించి 360 కిలోల అమ్మోనియం నైట్రేట్ స్వాధీనం చేసుకున్న ఘటనకు, ఢిల్లీ పేలుడుకు మధ్య సంబంధం ఉన్నట్లు గుర్తించినట్లు దర్యాప్తు సంస్థలు తెలిపాయి. మరోవైపు, తాజా పేలలుడుకు సంబంధించి ఢిల్లీ పోలీసులు ఉపా చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఫరీదాబాద్ లో బయటపడిన టెర్రర్ మాడ్యూల్ కు సంబంధం ఉందని ప్రాథమిక పరిశోధనలు సూచించడంతో దేశ రాజధానిలోని పలు ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. పేలుడుకు కారణమైన కారును నడుపుతున్న వ్యక్తి చిత్రాన్ని పోలీసులు విడుదల చేశారు. సీసీటీవీ ఫుటేజ్‌లో నమోదైన ప్రకారం సదరు వ్యక్తి ముసుగు ధరించి కారు నడిపించాడని పోలీసులు తెలిపారు.

### డాక్టర్ ఉమరే సూత్రధారి

ఢిల్లీ పేలుళ్లకు, పుల్వామాకు సంబంధం ఉన్నట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. పేలుడు కేసులో ఆత్మాహుతి బాంబర్‌గా అనుమానిస్తున్న డా.ఉమర్ మహమ్మద్ పుల్వామా నివాసి అని తేలింది. ఎర్రకోట సమీపంలో పేలిన వైట్ కలర్ హ్యుండాయ్ ఐ20 కారును అతడే నడుపుతున్నట్లు పోలీసులు తేల్చారు. 1989లో పుల్వామాలో జన్మించిన ఉమర్.. ఫరీదాబాద్ అల్ ఫలాహ్ మెడికల్ కాలేజీలో డాక్టర్‌గా పని చేస్తున్నాడు. జమ్ము కశ్మీర్, హరియాణా పోలీసులు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్ 'వైట్ కాలర్' టెర్రర్ మాడ్యూల్‌లో సోమవారం అరెస్టైన ఇద్దరు వైద్యులు అదిల్ అహ్మద్ రాథర్, ముజామ్మిల్ షకీల్‌లతో ఇతడికి సాన్నిహిత్యం ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత కొన్ని గంటలకే ఢిల్లీలో పేలుడు చోటు చేసుకుంది. టెర్రర్ మాడ్యూల్ బయట పడడంతో తనను అరెస్టు చేస్తారన్న భయంతోనే ఉమర్ ఈ దారుణానికి ఒడిగట్టునట్లు దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జమ్ము కశ్మీర్ లో ఉంటున్న అతడి తల్లి, సోదరులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

### సమీక్షించిన అమిత్ షా

ఢిల్లీ పేలుడు నేపథ్యంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా మంగళవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. పేలుడులో 12 మంది మరణించిన నేపథ్యంలో దేశంలో భద్రతా పరిస్థితిని సమీక్షించారు. హోం మంత్రి నివాసంలో జరిగిన సమావేశంలో కేంద్ర హోం కార్యదర్శి గోవింద్ మోహన్, ఐబీ డైరెక్టర్ తపన్ దేకా, ఢిల్లీ సీపీ సతీష్ గోల్చా, ఎన్ఐఏ డీజీ సదానంద్ వసంత్ డేట్ పాల్గొన్నారు. జమ్మూ కాశ్మీర్ డీజీపీ నళిన్ ప్రభాత్ వర్చువల్‌గా హాజరయ్యారు. పేలుడు తర్వాత పరిస్థితిపై ఉన్నతాధికారులు హోం మంత్రికి బ్రీఫింగ్ చేశారు.

### ముమ్మరంగా దర్యాప్తు..

ఎర్రకోట పేలుడు కేసును దర్యాప్తు సంస్థలు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నాయి. 500 మందికి పైగా అత్యంత నైపుణ్యం కలిగిన అధికారులు, సిబ్బందితో కూడిన భారీ బృందాన్ని ఇక్కడ మోహరించారు. ఈ బృందంలో ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ), నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ), నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జీ), ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్, స్థానిక పోలీసు విభాగాల సభ్యులు ఉన్నారు. కింది స్థాయి నుంచి ఉన్నతాధికారులతో ఈ బృందం విస్తృతంగా శోధిస్తోంది. ప్రత్యేక బృందం ఎర్రకోట సమీపంలోని వెయ్యికి సీసీటీవీల ఫుటేజ్‌ను పరిశీలిస్తోంది. మరోవైపు ఢిల్లీ, ఫరీదాబాద్, కాశ్మీర్ తదితర ప్రాంతాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.

## జూబ్లీహిల్స్‌లో ప్రశాంతంగా పోలింగ్



**అక్షరటుడే, హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రశాంతంగా కొనసాగుతోంది. మంగళవారం ఉదయం 7 గంటలకు ఓటింగ్ ప్రారంభమైంది. మధ్యాహ్నం 3 గంటల వరకు 40.20 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం 6 గంటల వరకు ఓటు వేసే అవకాశం ఉంది. గతంలో 50 శాతం మాత్రమే పోలింగ్ నమోదు అయ్యేది. ఉప ఎన్నికల్లో మధ్యాహ్నం 3 గంటల వరకే 40 శాతం ఓటింగ్ కావడంతో గతంలో కంటే అధిక స్థాయిలో ఓటింగ్ నమోదయ్యే ఛాన్స్ ఉంది. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి జూబ్లీహిల్స్ పోలింగ్ సరళిని హైదరాబాద్ సీపీ సజ్జనార్ పరిశీలించారు.

### ఓటు వేసిన ప్రముఖులు

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పలువురు సినీ ప్రముఖులకు ఓటు వేశారు. దర్శకుడు రాజమౌళి, హీరో గోపిచంద్ నటుడు తనికెళ్ల భరణి, హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు నవీన్‌యాదవ్, మాగంటి సునీత, దీపక్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు.

## ఓటెత్తిన బీహార్..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాయి. మంగళవారం జరిగిన రెండో విడత ఎన్నికలు చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా జరిగాయి. తొలి విడతలో మాదిరిగా రెండో విడుతలోనూ భారీగా పోలింగ్ నమోదైంది. ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోటెత్తారు. దీంతో పోలింగ్ కేంద్రాలు కిటకిటలాడాయి. మధ్యాహ్నం మూడు గంటలకు 60.40 శాతం ఓటింగ్ నమోదైంది. 122 అసెంబ్లీ స్థానాలకు ఈ నెల 6న జరిగిన తొలి విడత ఎన్నికల్లో 65 శాతం ఓటింగ్ నమోదైంది. తాజాగా మంగళవారం మరో 122 నియోజవకర్గాల్లో ఎన్నికలు నిర్వహించారు. ఈ నెల 14న ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలు వెల్లడించనున్నారు.



## ప్రిన్స్ మహేశ్ కోసం పాట పాడిన శృతిహాసన్

**టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు, గ్లోబల్ దర్శకుడు ఎస్.ఎస్.రాజ మౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. తాజా గా గ్లోబ్ ట్రాటర్ నుంచి ఫస్ట్ సాంగ్ "సంచారి" విడుదలైంది. ఈ పాటలో ప్రత్యేక సర్‌ప్రైజ్ ఏమి టంటే.. దీనిని పాడింది స్టార్ హీరోయిన్ శృతి హాసన్. సంగీతంపై మంచి పట్టు ఉన్న శృతి హాసన్ గతంలో కూడా పలు చిత్రాల్లో తన స్వరాన్ని వినిపించింది. ఇప్పుడు "గ్లోబ్ ట్రాటర్" కోసం ఆమె తన ఎనర్జీతో పాడిన పాట ప్రేక్షకుల్లో గూస్ బంప్స్ తెప్పిస్తోంది.**

—అక్షరటుడే, సినిమా డెస్క్

## భారత్‌పై సుంకాలు తగ్గిస్తాం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గుడ్ న్యూస్ చెప్పారు. భారత్‌పై సుంకాలు తగ్గిస్తామని ప్రకటించారు. దీనిపై త్వరలోనే ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తున్నామనే కారణంతో అమెరికా భారత్‌పై సుంకాలు విధించిన విషయం తెలిసిందే. కాగా.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ.. భారతదేశంపై సుంకాలను తగ్గిస్తామని, వాషింగ్టన్, న్యూఢిల్లీ వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయడానికి దగ్గరగా ఉన్నాయని తెలిపారు. రష్యా చమురు కారణంగా భారతదేశంపై సుంకాలు చాలా ఎక్కువగా ఉన్నాయని ట్రంప్ అన్నారు. అయితే భారత్ ఆయిల్ దిగుమతులను తగ్గిస్తోందని ట్రంప్ పేర్కొన్నారు. దీంతో తాము కూడా ఏదో ఒక సమయంలో సుంకాలను తగ్గిస్తామని తెలిపారు.

## అతి త్వరలో ప్రభుత్వాన్ని తెరుస్తాం: ట్రంప్

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికాలో 41 రోజులుగా కొనసాగుతోన్న షట్‌డౌన్ ముగింపు దశకు చేరుకుంది. ఈ షట్‌డౌన్‌ను ముగించేందుకు ప్రవేశ పెట్టిన తీర్మానానికి సెనెట్ ఆమోదం తెలిపింది. ఈ తీర్మానాన్ని ప్రతినిధుల సభకు పంపారు. ఈ పరిణామాలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. అతి త్వరలో తమ ప్రభుత్వ కార్యకలాపాలు సాధారణస్థితిలోకి వస్తాయని వెల్లడించారు.

## అందెశ్రీకి కన్నీటి వీడ్కోలు

- ముగిసిన ప్రజా కవి అంత్యక్రియలు
- పాడె మోసిన సీఎం రేవంత్‌రెడ్డి



**అక్షరటుడే, హైదరాబాద్ :** ప్రజాకవి, రచయిత అందెశ్రీకి అభిమానులు కన్నీటి వీడ్కోలు పలికారు. లాలాపేట నుంచి ఘట్‌కేసర్ వరకు సాగిన ఆయన అంతిమ యాత్రలో వేలాది మంది పాల్గొన్నారు. కళాకారులు అంతిమ యాత్రలో పాల్గొని పాటులు, నృత్యంతో నివాళి అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. అందెశ్రీ సోమవారం ఉదయం మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం ఉదయం ఆయన నివాసం నుంచి అంతిమ యాత్ర ప్రారంభమైంది. ఘట్‌కేసర్‌లోని ఎన్ఎఫ్‌సీ నగర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు.

అందెశ్రీ అంతిమ యాత్రలో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, పలువురు నాయకులు, కళాకారులు పాల్గొన్నారు. అంత్యక్రియలకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరై పాడె మోశారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ప్రభుత్వ లాంఛనాలతో అందెశ్రీ అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర సాధనలో అందెశ్రీ పాత్ర మరువలేనిదన్నారు. అందెశ్రీ రాసిన రాష్ట్ర గీతాన్ని పాఠ్యపుస్తకాల్లో చేరుస్తామని తెలిపారు. ఆయనకు పద్మశ్రీ ఇవ్వాలని ప్రధానిని కలిసి విజ్ఞప్తి చేస్తానని చెప్పారు. ఆయన కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇస్తామని సీఎం ప్రకటించారు.